

# వంశీ
# వెండితెర నవలలు

**వెండితెర నవలలు**
**వంశీ**

ముద్రణ: **మే, 2008**

మూల్యం : రూ. **100/-**

అక్షరాలంకరణ
పల్లవి గ్రాఫిక్స్,
హైదరాబాద్

ప్రింటర్స్:

ప్రచురణకర్తలు:
**సాహితీ ప్రచురణలు**
విజయవాడ - 2
ఫోన్ : 0866 - 6460633

**వెండితెర నవలలు......**


| | | |
|---|---|---|
| 1. | శంకరాభరణం | 5 |
| 2. | సీతాకోక చిలుక | 129 |
| 3. | శుభోదయం | 219 |
| 4. | అన్వేషణ | 255 |

# శంకరాభరణం

## చిత్రకథ

ఇంకా

**14 రీళ్ళ చిత్రం వెనుక కథ**

**నిశ్చల చిత్రాలు, లేఖలు**

# ఇంకా తెలవారలేదు

రాత్రి–

మలిఝాము దాటింది. ఆకాశంలో పిల్లలకోడీ, గొల్లకావిడా నడినెత్తికొచ్చి అటుగా ఒదిగిపోతున్నాయ్. ఆ చీకట్లో దూరంగా, నిండుగా ప్రవహిస్తోంది గోదావరి తల్లి.

సుదూరంగా వున్న పచ్చని ఎత్తయిన కొండలు ఆ రాత్రిలో నల్లగా, అస్పష్టంగా కన్పిస్తున్నాయి. వాటిమీంచి వీచే పిల్లగాలి, గోదావరి మీదికి ప్రసారమై సుడిగాలిలా రూపాంతరం చెంది గోదావరి నీళ్ళని ఆటలు పట్టించి అలలుగా మారుస్తోంది.

చల్లటి ప్రశాంతమైన ఆ రాత్రివేళ గోదావరి మధ్యలో "డుబ్ డుబ్ డుబ్ డుబ్" మన్న శబ్దం అస్పష్టంగా విన్పించసాగింది. గోదావరికి బాగా అలవాటయిన, కొత్తవాళ్ళకి బాగా కొత్తయిన ఆ శబ్దం కొన్ని క్షణాలకి స్పష్టాతిస్పష్టంగా విన్పించసాగింది. తీరా చూస్తే–

రాత్రివేళలు ప్రయాణంచేసే రూటు లాంచీ అది. నది నీటి పోటుకి ఎదురీదలేక దాని "డుబ్ డుబ్" శబ్దాన్ని మరింత పెంచుతోంది నిండు గర్భిణిలాంటి ఆ లాంచీ.

లాంచీలో వున్న పది పన్నెండుమంది ప్రయాణీకుల్లో ముగ్గురునల్గురు నిశ్చింతగా నిద్రపోతున్నా తక్కినవాళ్ళంతా జాగరణ చేస్తూనే వున్నారు.

వాళ్ళలో ముప్ఫయి ఏళ్ళ వయసున్న తులసి, పదేళ్ళ కొడుకు శంకరంతో ప్రయాణంచేస్తూ తన మజిలీకోసం నిరీక్షిస్తోంది. ఆమె కళ్ళు ప్రశాంతమై నిశ్చలంగా చూస్తున్నాయ్. ఆ ముఖంలో ఏదో దైవత్వం స్ఫురిస్తోంది. మొత్తంగా ఆమెలో ఎవరో దేవతామూర్తి తొంగి చూస్తోంది.

ఆ దేవత కన్న శంకరం తల్లి ఒడిలో నిద్రపోకుండా చెయ్యి లాంచీ కిటికీలోంచి బయటపెట్టి, ఒక పుల్లతో నీళ్లలో గుచ్చుతున్నాడు. ఆ పుల్ల ముక్క నీళ్ళని కోస్తున్నప్పుడు వచ్చే వింత శబ్దం ఆ పసిమనసుకి వీణానాదంలా తోచింది. లాంచీ కుదుపుకి లాంచీపైన డోరియా రేకుమీద ఇనప గొట్టం లయగా "టక్ టకా టక్ టకా" చప్పుళ్లు వాడి చెవులకి మృదంగ ధ్వనులుగామారి సోకాయ్. హుషారుగా తల్లి ఒళ్లోంచి లేచి లాంచీపైకి యెక్కాడు. ప్రదక్షిణచేస్తూ వాడు తిరుగుతుంటే

ఎటుచూసినా ఉరకలువేసే నీటి కెరటాలు, చల్లటి ఈదురుగాలి ఆ కుర్రాడిలో ఎక్కడలేని మానసోల్లాసాన్ని కల్గిస్తున్నాయి. గొంతెత్తి పెద్దగా రాగంతీశాడు. మరుక్షణం అది ప్రతిధ్వనించేసరికి మహానందపడిపోయి నోటికి రెండుచేతులు అడ్డుపెట్టి మళ్లీ మళ్లీ పాడాడు.

లాంచీలో ప్రయాణీకులు వాడి శ్రావ్యమైన కంఠాన్ని వింటూండగా తులసి మనసెక్కడో వుంది. ఈ లాంచీ తన తీరాన్ని ఎప్పటికి చేరుస్తుందో! ఈ చీకటిని వెలుగొచ్చి ఎప్పుడు తరుముతుందో!!

ప్రయాణీకుల్లో ఒకామె "ఆ అబ్బాయి మీ అబ్బాయేనా? గొంతు చాలా బాగుంది" అని ఆ తల్లితో అంటూంటే ఆమె తృప్తిగా నవ్వుతూ తలొంచుకుంది.

పైన శంకరం ఆనందం హద్దులు మీరుతోంది. ఒక పొడుగాటి కర్ర తీసుకొని ఎగుడు దిగుడుగా వున్న డోరియా రేకుమీద గీస్తూ, వచ్చే ఆ వింత శబ్దాన్ని ఏదో తంత్ర వాయిద్యపు నాదంలా అనుభూతి పొందుతూ హుషారుగా గంతులు వెయ్యసాగాడు.

క్రిందినుంచి వాడి అల్లరి వింటున్న తులసి, 'కాలు జారుతుంది దిగు' అన్న సైగతో పిల్చింది.

శంకరం లోనికొచ్చి కూర్చోబోతుండగా, కాళ్లకి చిన్న చిన్న ఇత్తడి బిందెలు రెండు తగిలాయ్. వాటిని కళ్ళకద్దుకొని, తల్లిచెప్తున్నా వినిపించుకోకుండా రెండుచేతుల్లోకి తీసుకొని లయగా వాయించసాగాడు. నిద్రరాని ఓ పెద్ద మనిషి అగ్గిపెట్టెని తీసుకుని వేళ్లతో దానిమీద తాళంవేస్తూ శంకరానికి మరింత హుషారు తెప్పిస్తుంటే బిందెలు పక్కనపెట్టి తన పక్కన కూర్చున్న ఆమెనుంచి తాళంగుత్తి తీసుకుని ఆ అగ్గిపెట్టె శబ్దాన్ని అనుకరించసాగాడు. ప్రయాణీకులందరూ ఆ చిన్న సైజు వాద్య కచేరీని ఆనందంగా తిలకిస్తుండగా సరంగు లాంచిని దగ్గరపడుతున్న రేవువైపు మళ్లించే నిమిత్తం చుక్కాని చక్రం తిప్పాడు.

గోపాదాల రేవు దిగిన తులసి నిద్రలో జోగుతున్న శంకరాన్ని, రేవు ఒడ్డునున్న ముసలి రావిచెట్టు చప్టామీద పడుకోబెట్టి దుప్పటికప్పి, వాడి పక్కనే కూర్చుని ఎప్పుడు తెల్లవారుతుందా అని ఎదురు చూడసాగింది.

గోదావరి గాలి ఉన్నట్టుండి ఉధృతం అవుతూంది. దాని తాకిడికి శంకరంమీద కప్పిన దుప్పటి చెదిరిపోతూంది. దాన్ని వాడిమీద సరిగా కప్పి, తల చప్టామీదికి వెనక్కి వాల్చి, వందేళ్లు వయసున్న ఆ రావి చెట్టుని తలక్రిందులుగా చూడసాగింది. దాని కొమ్మలు, ఆకులు గజిబిజి అయిన జీవితంలా కలసిపోయి అల్లుకుపోయి వున్నాయ్. సరిగ్గా పదేళ్ల క్రితం ఈ స్నానాలరేవు, ఈ ముసలిరావిచెట్టు, దూరంగా కనబడే ఆ చిన్నపట్నం తనకి సుపరిచితమైనవి. కానీ, కాలం కబంధహస్తంలా, తుఫానులో బలమైన కెరటంలా తనని ఎక్కడికో... ఎక్కడికెక్కడికో నెట్టేసింది. కాలమే దయతలచి పదేళ్ల తర్వాత మళ్లీ తననీ పరిసరాలకి ఎగత్రోసింది. కాలప్రవాహంలో ఎటుతోస్తే అటుపోయే గడ్డిపోచలం మనం. ఆలోచిస్తున్న తులసి ముఖంమీద చీకట్లు తరమబడి తెల్లటి కాంతి ప్రసారమైంది. చూస్తే–

తూర్పున కెంపురంగులో సూర్యుడు ఉదయిస్తున్నాడు. ఎక్కడో ఏదో రాగం వీణలోంచి, వేణువులోంచి మిశ్రమమై విన్పిస్తోంది. దూరంగా గాలి గోపురంలో గూళ్లు కట్టుకుని వెచ్చగా బ్రతికే పావురాళ్లు టపటపా రెక్కలు కొట్టుకుంటూ పైకి లేచాయి. రాత్రంతా నల్లగా కన్పించిన గోదావరి నీటికెరటాలు నీలమై మృదువుగా ఒడ్డును తాకుతున్నాయ్.

ప్రకృతిలో అలా వెలుగురేఖలు విచ్చుకోవడంతో తులసి మనసులో ఆత్రం మరీ పెరగసాగింది. ఎవరికోసమో కళ్లతోనే పరిసరాలన్నీ వెతుకుతోంది.

కొద్దిక్షణాలకి ఆమె నిరీక్షణ సఫలీకృతమైనట్టు, ఆమె వెతుకుతున్న ఆ మూర్తి, ఊహతెల్సినప్పటినుంచి కోటి పుష్పాలతో పూజిస్తున్న ఆ దైవం అక్కడ ప్రత్యక్షం అయ్యారు.

తను కన్పించకుండా పక్కకి ఒదిగి ఆయన్నేచూస్తూ అప్రయత్నంగా రెండుచేతులూ జోడించి నమస్కరించింది. ఆ మూర్తి మీద తనకున్న మహాపవిత్రమైన భక్తి భావమంతా ఆమె ముఖంలో స్పష్టమౌతోంది ఆ క్షణాన.

ఆరు అడుగుల విగ్రహం– నీరుకావి పంచలో ఎడమకాలికి గండపెండేరం, కుడిచేతికి గంటా కంకణంతో ఠీవిగా, ధీమాగా నడచి వెళుతుంటే కైలాసగిరి నుంచి ఆ నాదశరీరుడే తనకి ప్రత్యక్షమయ్యాడా అనిపించిందామెకి.

ఆయన సరాసరి రేవులోకి దిగి చెంబు మెట్టుమీదపెట్టి, భుజంమీద పంచ నీళ్లలో తడిపి, గుంజి దాని అంచుని రేవులో పాతివేసివున్న ఒక ఇనపకమ్మెకి కట్టి ఆరవేస్తున్నపుడు ఆ పంచకువున్న చిరుగుల్ని చూసిన తులసి గుండె నీరయిపోయింది. గుండెల్లోంచి దుఃఖం పొంగిపొర్లింది. ఆ పంచకివున్న చిరుగులద్వారానే వర్తమానంలో ఆయన ఎంత దరిద్రం అనుభవిస్తున్నారో అవగాహన చేసుకున్న తులసి కళ్ళనిండా నీరు నిలిచింది. ఆ పంచ మసక మసగ్గా కన్పించింది.

ఆమె మస్తిష్కం పదేళ్ళ క్రిందటి ఆయన వైభవాన్ని ఆ గతంలో తన జీవితాన్ని జ్ఞప్తికి తెచ్చుకోసాగింది....

## ఆ ఆకుపచ్చని జ్ఞాపకాలు

ఆ ఆడిటోరియం అంతా సంగీత ప్రియులతో నిండివుంది. అంతా నిశ్శబ్దంగా సభావేదికని మూసిన రంగురంగుల శిల్కు తెర ఎప్పుడు విడుతుందా అని ఎదురుచూస్తున్నారు.

ప్రేక్షక శ్రోతల్లో ముందువరసలో కూర్చున్న ఇరవైయేళ్ల కన్య తులసి మనసంతా తెరమీద వుంది. ఆమె పక్కనే కూర్చునివున్న ఆమె తల్లి 'రత్నపాప' ఆ జిల్లా అంతా పేరుమోసిన వేశ్య. ఆమె మనసంతా యెటో వుంది తప్ప కచేరీకి వచ్చినట్టు లేదు.

అంతలో తెరవెనుకనుంచి కార్యక్రమ నిర్వాహకుల గొంతు గంభీరంగా విన్పించింది. "ఈనాటి సంగీత విభావరి ఎంతో వీనులవిందుగా కొనసాగింది– ఈ విరామానంతర ప్రధానాంశం 'శంకరాభరణం.' నాదోపాసకులు శ్రీ శంకరాభరణం శంకరశాస్త్రిగారు, ఏ రాగానికి తాము జీవం పోశారో, ఏ రాగాలాపనలో ఆబాలగోపాలాన్ని అలరింపజేశారో ఆ రాగం శంకరాభరణాన్ని ఆలపిస్తారు."

అది వినడంతో తులసి ముఖంలో ఆనందరేఖలు వెల్లి విరిశాయి. ఆత్రుత అధికం అయింది. ఒళ్లెరగకుండా సంగీతంలో లీనం అవుతూన్న కూతురి వంటిమీది నగలు రత్నపాప సర్దబోతుంటే ఈ లోకంలోకి వచ్చిన తులసి విసుక్కుంటూ 'చప్పుడు చెయ్యకు. చిన్న శబ్దం అయినా శాస్త్రిగారికి కోపం వస్తుంది' అన్నట్టు సైగ చేసింది.

తెర వెనుకనుంచి మృదంగం సరి చేసుకుంటున్న చప్పుళ్లు, తంబుర శృతి చేస్తున్న ధ్వనులు విన్పిస్తుంటే ప్రేక్షకులు ఊపిర్లు బిగబట్టున్నారు. ఎప్పుడు విడుతుందా తెర! అని.

కొద్ది క్షణాల్లో సున్నితంగా తొలగింది తెర.

శిల్కుకోటులో, జరీ తలపాగా పెట్టుకున్న నలభై ఏళ్ల శంకరశాస్త్రి గారు రాజఠీవితో ప్రేక్షకులకి పునర్దర్శనం యిచ్చారు. ఆయన, తన చేతిలో తంబురను వెనక కూర్చున్న ఏడేళ్ల కూతురు శారదకి నవ్వుతూ అందిస్తుంటే పక్క వాయిద్యగాళ్లలో ముఖ్యుడయిన గోపాలం మృదంగంతో లయ కలపటానికి సంసిద్ధుడయ్యాడు.

శారద తంబుర మీటగా, శాస్త్రిగారు నాభిలోంచి ఉద్భవిస్తున్న ఓంకారంతో శంకరాభరణాన్ని ఆలపించసాగారు.

ఆయన అలా గొంతెత్తి పాడుతుంటే ముగ్ధులవుతున్న ప్రేక్షకుల్లో ప్రప్రథమురాలయిన తులసి, తను ఏవో సుందర వనవాటికలలో ఆ గానానికి అనుగుణంగా నర్తిస్తున్న అనుభూతి పొందసాగింది. రత్నపాప మట్టుకు తను ఆహ్వానించిన వ్యక్తి యింకా రానందుకు మాటిమాటికీ వెనక్కి తిరిగి చూస్తోంది. ఎవర్నీ పట్టించుకోకుండా అమృతవాహినిలా సాగుతోంది గానం.

శాస్త్రిగారు అలా తనువు మరిచి పాడుతుంటే రత్నపాప నిరీక్షిస్తున్న వ్యక్తి రామవరం పిల్ల జమీందారు రావడం జరిగింది. అంతసేపూ నిశ్శబ్దంగావున్న ప్రేక్షక వాహినిలో జమీందారు రాక కాస్త చలనాన్ని రేపింది. అతనికి నమస్కరించే వాళ్లు, లేచి నిలబడేవాళ్ళ శబ్దాలు అధికమయ్యాయి. జమీందారు దర్పంగా నడుచుకుంటూ వచ్చి ముందు వరసలోని కుర్చీ ఒకటి లాక్కుని కచేరీ జరుగుతుందన్న విచక్షణా జ్ఞానాన్ని మరిచి రత్నపాపతో బాతాఖానీ ప్రారంభించాడు.

జమీందారు బరబరా కుర్చీ లాగడం, పెద్దగా నవ్వుతూ మాట్లాడ్డం శాస్త్రిగారి గానానికి అంతరాయం కల్గించాయి. పాడుతున్న పాటని టక్కున ఆపేసి లేచి వేగంగా వెళ్లిపోయారు.

ప్రేక్షకులు నిశ్చేష్టులయ్యారు. మృదంగంగోపాలం జమీందార్ వైపు కోపంగా చూశాడు. జమీందార్ వెళ్ళిపోతున్న శాస్త్రిని "ఎంత పొగరు ఈ సంగీతం పంతులకి" అన్నట్టు చూస్తూ పళ్లునూరసాగాడు...

శాస్త్రిగారిలాగే గంభీరమైంది ఆయన భవంతికూడా. కచేరీనుంచి శారదని గోపాలం తీసుకురాగానే వంటమనిషి జానకమ్మ శారద కాళ్ళు కడిగి బట్టలు మారుస్తుండగా, అక్కడ సభలో శాస్త్రిగారి ప్రవర్తన గురించి ఏకరువు పెట్టసాగాడు గోపాలం.

"అదేమిటో ఓ జమీందారని గానీ, ఓ ఆగర్భశ్రీమంతుడనిగానీ ఏమీ లేదనుకో జానకమ్మా-మాంచి రసకందాయంలో వున్న పాటని తక్కున ఆపేసి లేచి వెళ్ళిపోయారంతే..." అంటూ శారదవైపు చూసి "కదూ, శారదమ్మా?" అన్నాడు.

"ఊఁ" అని మార్చిన బట్టల్ని చేత్తోపట్టుకుని లోనికెళ్ళిపోయింది శారద.

పదిహేనేళ్ళుగా ఆ యింటిలో వుంటున్న జానకమ్మ గోపాలం మాటకి అడ్డొస్తూ అంది. "మరి ఆయన గళం విప్పారంటే తపస్సు చేస్తున్న ఋషిలా కూర్చుంటారాయె. మన శారదమ్మ పుట్టినప్పుడు ఏమైందో తెల్సా గోపాలం... అమ్మగారికి నొప్పులు మొదలయ్యాయి. పరిస్థితి విషమిస్తోందని డాక్టరు చెప్పగానే కచేరీలో వున్న అయ్యగారికి ఆమాట చెప్పడానికి బయలుదేరాను. ఏకాగ్రతతో పాడుతూన్న అయ్యగారిని చూసేసరికి నోరు మెదపలేక పోయాననుకో. తీరా ఆయన కచేరీ పూర్తిచేసుకుని ఇంటికొచ్చేసరికి అంతా అయిపోయింది పాపం."

ముక్కుమీద వేలేసుకుని "ఆఖరి చూపుకూడా దక్కలేదన్నమాట" అని బాధగా అన్నాడు గోపాలం.

అంతలో టాంగా వస్తున్న చప్పుడు విన్పించసాగింది.

గోపాలం అదిరిపడ్డాడు. ఇప్పుడాయన ఆ కోపం ఎవరిమీద చూపిస్తారో అని గోపాలం వణికిపోయాడు.

"మన బండిలా వుందమ్మా! చూశావా ఆ డెక్కల చప్పుడులో కూడా కోపం వినిపిస్తుందిరా దేవుడా" అని బెంబేలు పడిపోతుండగానే టాంగావచ్చి ఇంటివాకిట్లో ఆగింది.

పనివాడు పరుగునవెళ్ళి తలుపు తియ్యడానికి జాప్యం చేస్తుంటే "ఊఁ" అని శాస్త్రి గదమాయించడంతో వాడు కంగారుగా తలుపు లాగాడు.

బండి దిగి కోపంగా లోపలికొస్తున్న శాస్త్రికి ఊహించని విధంగా తంబుర నాదం విన్పించింది.

తండ్రి కొచ్చిన యెంతటి కోపాన్నయినా క్షణంలో శాంతింపచేయగల సాధనం ఒక్క తంబురనాదమే అని, ఆ చిట్కా తనకే తెలిసినట్టు శారద ఉయ్యాల బల్లమీద కూచుని తంబుర మీటుతూ ఆలపిస్తూంది... ... దాంతో ప్రభంజనంలా మండిపడ్తున్న శాస్త్రి మంచులా కరిగి, ప్రసన్నంగా కూతురువైపు చూశాడు...

✤ ✤ ✤

గోదావరి శాంత గంభీరంగా ప్రవహిస్తోంది. ఏటి వొడ్డున పసుపు పచ్చటి పూలు, విరబూసిన జీడిమామిడి చెట్లమీద పక్షులు రమ్యంగా రాగాలు పాడుతుంటే, చింతచెట్లమీద నిద్రరాని చీకటిపక్షులు కాళ్ళకీ కొమ్మలకీ లంకెలువేసి టపటపా రెక్కలు కొట్టుకుంటున్నాయ్. ఉషస్సులో ఆ శబ్దాలన్నీ వింత సౌరభాన్ని సృష్టిస్తున్నాయ్.

అదే సమయాన గోదారివడ్డున కూర్చుని తన సంధ్యావందన కార్యక్రమం పూర్తిచేసుకుంటూ, శారదని కంఠంవరకూ కూర్చోబెట్టి సంగీతసాధన చేయిస్తున్నారు శాస్త్రి.

తెలతెలవారబోతూన్న ప్రకృతిలో, సూర్యభగవానునికి స్వాగతం పలుకు తున్నట్టుంది, ఆయన గంభీరమైన గళంతో చేరి, చలితో కొత్త గమకాలు సంతరించుకుంటున్న ఆ పసిపిల్ల స్వరం.

అనుక్షణం శాస్త్రిగారి సంగీతం కోసం పరితపించే తులసి, అల్లంత దూరం నుంచే ఆ సంగీత మాధుర్యాన్ని గ్రోలుతూ అప్రయత్నంగానే ఆ స్వరానికి అనుగుణంగా నృత్యం చెయ్యసాగింది. క్షణక్షణానికి స్వరంలో అధికమయ్యే వేగంలానే తులసి నృత్యం కూడా తారస్థాయినందుకుంటూ తనకు తెలీకుండానే ఆయనకి దగ్గరగా వెళ్ళిపోతోంది.

తులసిని చూసిన శాస్త్రి పాడటం ఆపేశారు. అలా ప్రకృతిలో నిశ్శబ్దం ఏర్పడ్డంతో ఊహల తీరాల్లో నర్తిస్తున్న తులసి వాస్తవానికి వచ్చి కళ్ళముందు శాస్త్రిని చూసింది. ఆయన గానానికి అంతరాయం కల్గించినందుకు శపిస్తారా అన్నంత భీతితో వణికిపోతోందామె.

క్షమించమని కళ్ళతోనే వేడుకుని, మనసులోనే నమస్కరించి నిశ్శబ్దంగా వెనక్కి తిరిగిపోతున్న ఆ తులసికి, మధురాతిమధురంగా మధురమైన ఆయన గళంలోంచి మళ్ళీ ఆలాపన వినరావడంతో అంతులేని ఆనందంతో తల మునకలయి, తన చెవులని తనే నమ్మలేకపోయింది. అది నిజమని నిర్ధారణ అయ్యేసరికి దైవసాక్షాత్కారంగా తోచిందా క్షణం.

సంగీతం, నాట్యం ఆ చెరగులో సంగమమై ప్రకృతికి ఋణపడి చేసిన అద్భుతమైన విందులా కొద్దినిమిషాలసేపు ఆ రాగాలాపన, నృత్య విద్యాప్రదర్శనా జరిగాక, నిష్కల్మషమైన, నిజమైన కళాకారులుగా ఆ ఇద్దరి హృదయాలూ తృప్తితో

నిండిపోయాయ్. ఆ మహానుభావుడు తనకి కల్గించిన ఆ గొప్ప అవకాశానికి పరవశిస్తూ, అంజలి ఘటించి ఆయన దివ్యచరణాలకి వందనం చేసింది తులసి. శాస్త్రి ఆమెని మౌనంగా ఆశీర్వదించారు.

❖ ❖ ❖

ఆ వూళ్ళో శాస్త్రిగారి చిన్ననాటి స్నేహితుడూ, మంచి ప్రాక్టీసువున్న లాయరూ అయిన మాధవాచారి ఆ వుదయం బెంగుళూరు నుంచి వచ్చిన 'కన్నడ సంఘ సెక్రటరీ'ని వెంటబెట్టుకుని నానాహంగామా చేసుకుంటూ వచ్చాడు. గోపాలం లోపల్నుంచి మద్దెల తీసుకొస్తుండగా యెదురైన మాధవాచారి–

"ఏమయ్యా గోపాలం ఇదేమన్నా న్యాయంగా వుందా? అహ వుందాంటున్నాను?" అని నిలేశారు.

"నా మద్దెల నేను మోసుకొస్తుంటే న్యాయంగా వుందాంటారేమిటండీ?" విస్తుపోతూ అడిగాడు గోపాలం. కానీ, అతనికి తెల్సు. శాస్త్రిగారికి మాధవాచారి స్నేహితుడయినా, వాళ్ళది చాలా చిత్రమైన స్నేహమనీ, ఆయన యెదురుగా వుండగా ఈ మాధవాచారి భయపడిపోతూ గడపల వంకా ద్వారబంధాల వంకా చూస్తూనే మాట్లాడతాడని. కానీ, ఇవ్వాళేమిటీ శాస్త్రిగారు ఇంట్లో వున్నా కూడా లెక్క చెయ్యకుండా ఈయన యిలా దూసుకువచ్చాడు? బహుశా వున్నట్లు తెల్సుండదు పాపం అనుకున్నాడు.

"అది కాదయ్యా ఈయన వచ్చి ప్రోగ్రాం విషయమై నిన్ను కలిస్తే కాన్సిలు చేసుకోమన్నావటేమిటి?" అని ఆ కన్నడం అతన్తో వచ్చీరాని కన్నడంలో "నీవు కూతుకొళ్ళినా హెళ్తిని" అంటూ తనే ఓ కుర్చీ లాక్కుని కూర్చుంటూ–

"చూడూ– మన తెలుగువాణ్ణి మన తెలుగువాళ్ళు ఆహా ఓహో అనుకోవడం వేరయ్యా. ఎక్కడో కన్నడ దేశస్తులు, కన్నడ సంఘం తరఫున వచ్చి, మనవాడి కచేరీ పెట్టి ఘనంగా సన్మానం చేస్తామంటున్నారాయె. గజారోహణం, మంత్రిగారిచేత గండపెండేర బహూకరణం పెద్ద ఎత్తున ఏర్పాటు చేసుకున్నారయ్యా వాళ్లు..." అని మాధవాచారి వివరిస్తుంటే మధ్యలో ఆ కన్నడం అతను లేచి అందుకున్నాడు–

"హౌదు స్వామీ– శంకరశాస్త్రి అవరిగే భారీ విజృంభణేందె యెల్లా ఏర్పాటుగళ్ళు మాడిద్దేవె. అవర హెప్రెళి తుంబా టిక్కట్టుగళ్ళు మాడిద్దేవె ఇవాగ నీవు కచ్చేరీ యిల్లాంద్రే నన్నిల్లాన్స్ బిడ్తారే స్వామి."

తన ఆర్గ్యుమెంట్ కట్ చేస్తూ అతనలా కన్నడంలో, కన్నడంరాని గోపాలానికి కష్టాలు చెప్పుకుంటుంటే మాధవాచారికి విసుగొచ్చింది. కోపంగా అతనికేసి తిరిగి–

"అదిదా నా మాతాడ్తాయిద్దిని. మహాప్రభో– నీవు మాతాడక సుమ్మనిరు సుమ్మనిరు" అని సీరియస్‌గా గోపాలంకేసి తిరిగి "విన్నావుటయ్యా కన్నడంలో యెంత బాధపడుతున్నాడో పాపం – ఆరు నూరైనా సరే ఈ కచేరీ జరిగి తీరవల్సిందే..."

"అష్టే స్వామీ అష్టే. శంకరశాస్త్రి అవర కచేరీ నడిది హోదిరే..." అని కన్నడం అతను మళ్ళీ లేవబోతే, మాధవాచారికి నిజంగా బోల్డుకోపం వచ్చేసింది. "అయ్యో మధ్యదల్లి నీవు మాతాడ బేడాంత హెళిదినల్వా... హెళిదినల్వ?"

"హెళిదిరి స్వామీ."

"ఎనకి టిట్టిబిడు... నీవు కూతుకొళ్ళి... కూతుకొళ్ళి... కూతుకొళ్ళి" అంటూ అతన్ని బలవంతంగా నోరు కట్టించి, కూర్చోబెట్టేసి "ఏవయ్యా వీడిపాట జనం వినే అదృష్టం లేకుండా చేద్దామనా నీ ఉద్దేశ్యం? ఏమిటని" అంటూ కన్నడం వాడిమీద కోపం గోపాలంమీద చూపించేశాడు.

ఇదెక్కడి గొడవరా బాబూ అనుకుంటూ "నన్నడుగుతారేమిటండీ? మీరిద్దరూ శివకేశవుల్లాగ మంచి స్నేహితులు గదా– అయ్యగారినే అడగండా మాట" అన్నాడు గోపాలం.

"అడుగుతానయ్యా– అడగడమేమిటి కడిగేస్తాను" అంటూ లాయర్ దర్జాతో కుర్చీలో కూర్చుని "పది మర్డర్లు చేసిన వాణ్ణయినా సరే కళ్లల్లోకి సూటిగా చూసి నేరం ఒప్పించేస్తాను. ఏం వీడంటే నా కేమన్నా భయం అనుకుంటున్నావేమో– ఉన్నాడా లోపల?" లేడని మనసులో తెల్సుండే ధీమాగా అడిగాడు.

"ఆ పక్కగదిలోనే వున్నారు" అని గోపాలం చెప్పడంతో, తన కుర్చీ వెనక్కెవరో బర్రున లాగినంత ఫీలింగొచ్చి లేచిపోతూ, భయంగా "నీ మొహం మండా చెప్పవేమయ్యా ఆ మాట?– నా మాటలు వినివుంటాడంటావా?" అని కంగారు పడ్తుండగానే శాస్త్రి వచ్చారు.

కన్నడం అతను లేచి నమస్కారం పెడితే, మాధవాచారి వణికిపోతూ కర్రలా నిలబడే ప్రయత్నం చేస్తున్నాడు, వెకిలి నవ్వు నవ్వుతూ.

"ఏమిట్రా మాధవా? ఏమిటి యెవర్నో కొట్టేస్తాను, చెరిగేస్తానంటున్నావ్?" అని శాస్త్రి అడిగేసరికి మాధవయ్య కంగారు మరింత పెంచేసి మాట మార్చేస్తూ "ఆc మీ మరదల్నిరా, బజార్లో యెక్కడా కూరగాయల్లేనట్టు, మూడు రూపాయలు తీసుకెళ్ళి ఒక్క కిలో వంకాయలు తెచ్చింది వంకాయలు! ఈ సంగతే గోపాలానికి చెప్తున్నాను. ఏమోయ్ గోపాలం?'' అన్నాడు గోపాలంకేసి చూడకుండా ద్వారబంధంకేసి చూస్తూ.

కన్నడ సంఘం అతను ఇదేమిటీ ఆయన రావడంతో కచేరీ సంగతి మానేసి వంకాయల గురించి మాట్లాడుతున్నాడు అనుకుని అర్థంగాక మాధవయ్యగార్ని "ఏను స్వామి కచేరీ విషయ మాటాడిబిట్టు వంకాయ్ గింకాయ్ హెళితెదరల్లా?" అని అడిగాడు నెమ్మదిగా.

ఈయన సంగతి నీకు తెలీదు, మాట్లాడ్డంలో లౌక్యం కావాలన్నట్టు మొహంపెట్టి "నినగి అవర విషయ గొత్తిల్ల- మొదలే కచేరీ విషయ హెళిదిరే... ఫట్!" అని శాస్త్రి దగ్గిరకొచ్చి వెర్రినవ్వొకటి పారేసి "పిచ్చిదీ తెచ్చిందే అనుకో, అన్నీ వంకాయలే తేవాలా? ఇదేమన్నా బాగుందా??" అని మాట మార్చి కన్నడం అతన్ని చూపించి "వీరు కన్నడ సంఘం సెక్రట్రీ పాపం" అని విషయంలోకి రాబోతుండగా అర్థంగాని శాస్త్రి నిశితమైన చూపొకటి చూశాడు.

దాంతో మళ్ళీ కంగారుగా ప్లేటు ఫిరాయించేసి "ఇప్పుడు వంకాయలు తెచ్చిందే అనుకో నాణెంగా వుండాలా అన్నీ పుచ్చులే... వీరు నీ కచేరీ పెట్టించి..." అని విషయంలోకి రాబోతుండగా-

"ఊc." అన్నాడు అర్థంగాని శాస్త్రి.

మాధవయ్యగారి పరిస్థితి చూస్తున్న గోపాలం నవ్వు ఆపుకోలేక పోతున్నాడు.

"ఉ... ఉ... ఇ... ఇప్పుడు పుచ్చులైనా గుత్తివంకాయ వెయ్యమన్నాను. మరి వేసి ఏడ్చిందా! మామూలు అల్లంవేసి తగలబెట్టింది. వీరూ గండపెండేరం..." అని చెబుతూంటే అదేం పట్టించుకోనట్టు ముఖం పెట్టిన శాస్త్రి, పనివాడు తెచ్చిన మందులూ చిల్లరా తీసుకుని "అమ్మాయ్ శారదా!" అని పిల్చాడు.

వచ్చిన శారదకి అవి యిస్తూ "లోపల పెట్టమ్మా" అన్నాడు.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Venditera+Navalalu**

* * *